వికసించిన గాజువాక

- స్వాతంత్య్రం సిద్ధించేనాటికి కుగ్రామం
- నేడు మహా పట్టణంగా విస్తరణ
- తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే టాప్



ఏనుగులు నీళ్లు తాగిన ప్రాంతం ఇదేనట



ప్రస్తుత గాజువాక మహా పట్టణం

గాజువాక: దేశ దాస్య శృంఖలాలు తెగిపడిన క్షణం.. భారతీయులంతా గుండెలనిండా స్వేచ్ఛా వాయువును పీల్చుకున్న సమయం.. సంబరాలు అంబరాన్నంటిన ఆ రోజు 1947 ఆగస్టు 15. ఆ అపురూప క్షణాల వీక్షణమప్పుడు గాజువాక పేరుతో ప్రాంతమే లేదు. జాతి గర్వించేలా ఉక్కు కర్మాగారం, ఆ వరుసగా వచ్చిన పరిశ్రమలు, కిక్కిరిసిన జనాలతో నిండి ఉన్న గాజువాక స్వాతంత్య్రం వచ్చిన రోజున లేదంటే నిజంగా ఆశ్చర్యమే. పొరుగునే ఉన్న భీమిలి, అనకాపల్లి, విశాఖలో సమర యోధుల విప్లవ నినాదాలు వినిపించినా గాజువాకలో ఆ ఊసే లేదంటే నమ్మశక్యం కాదు. ప్రకృతి ఒడిలో ఎదిగిన గాజువాక ప్రాంతం దేశానికి స్వాతంత్య్రం సిద్ధించే సమయానికి రకరకాల పేర్లతో చిన్న చిన్న గ్రామాలుగా ఉండేది. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి సుమారు రెండు దశాబ్దాలు గడిచిన తర్వాత గాజువాక పేరు ప్రపంచానికి పరిచయమైంది. 1965 నుంచి గాజువాక పేరు వాడుకలోకి వచ్చింది. నిరంతరం జనంతో కిక్కిరిసి ఉండే ప్రస్తుత పాతగాజువాక ప్రాంతాన్ని అంతకుముందు మెట్ట మర్రిపాలెంగా పిలిచేవారు. చట్టివానిపాలెం, అజీమాబాద్, పల్లావారి చేలు, ఉరుకూటివారి కొంపలు ఉన్న ప్రాంతాన్ని అప్పట్లో గాజువాకగా పిలిచేవారు. చినగంట్యాడ పంచాయతీకి పాత గాజువాక శివారు గ్రామంగా ఉండేది. ఆ తర్వాత పాతగాజువాకను చినగంట్యాడ పంచాయతీ నుంచి వేరు చేసి పంతులుగారి మేడ, జోగవానిపాలెం, కొత్త గాజువాకను కలిపి గాజువాక పంచాయతీ చేశారు.

నాటి గజ్‌వా.. నేటి గాజువాక

స్వాతంత్య్రానికి పూర్వం గాజువాకను గజ్‌వాగా పిలిచేవారని చెబుతుంటారు. గజ్‌వా అంటే పర్షియన్ భాషలో పొలిమేర అని అర్థం. ప్రస్తుత కొత్త గాజువాక నుంచి జింక్ కర్మాగారానికి వెళ్లే మెయిన్ రోడ్డు రెండు కొండలను చీల్చుకొని వెళ్తున్నట్టుగా ఉంటుంది. ఈ రహదారి ఒకప్పుడు వాగుగా ఉండేది. ఈ వాగులో ఏనుగులు నీరు తాగేందుకు వచ్చేవని, ఆ విధంగా దీన్ని గజవాగు అని పిలిచేవారని నాటితరం చెబుతుంటారు.

మరో కథనం ఇలా..

గాజువాకకు ఈ పేరు రావడానికి మరో కథనం కూడా వాడుకలో ఉంది. విజయనగరం మహారాజుల ఏనుగులు ఈ ప్రాంతంలో ఉండేవని, అందువల్ల ఈ ప్రాంతాన్ని గజవాక అని పిలిచేవారని, అది క్రమేణా గాజువాకగా మారిందని చెబుతుంటారు.

షిప్‌యార్డ్ ఆవిర్భావంతో మారిన రూపురేఖలు

షిప్‌యార్డ్ ఆవిర్భావంతో ప్రారంభమైన గాజువాక ప్రాంత అభివృద్ధి బీహెచ్‌పీవీ ఏర్పాటుతో వేగవంతమైంది. అనంతర కాలంలో హిందుస్తాన్ జింకు (ప్రస్తుతం ఈ పరిశ్రమ లేదు), హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వరంగ పరిశ్రమల ఆవిర్భావంతో పాటు 1970లో ఉక్కు కర్మాగారం వచ్చాక గాజువాక రూపు రేఖలు మారిపోయాయి. 1965–70 నాటికి ఇక్కడి జనాభా కేవలం పదివేలు. ఇప్పుడు నాలుగున్నర లక్షలమందితో జన గాజువాకగా ఎదిగింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో గాజువాక తలసరి ఆదాయం అత్యధికం కావడం విశేషం.

భెల్‌లో పంద్రాగస్టు వేడుకలు నేడు

అక్కిరెడ్డిపాలెం: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను గురువారం భెల్ (హెచ్‌పీవీపీ)లో ఘనంగా నిర్వహించనున్నారు.ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంస్థ ఈడీ ఎస్.జితేందర్ రెడ్డి, సీనియర్ కార్మికుడు యు.ఆనందరావుతో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరింపజేస్తారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా వెంకన్న కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో వచ్చిన శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి నేతృత్వంలో అర్చకులు మనోజ్ స్వామి, హరి నారాయణలు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి కల్యాణం కమనీయంగా జరిపారు. ఉక్కునగరంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నూతన విభాగాధిపతికి అభినందన



రవి చంద్రబాబును సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగాధిపతిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన రవి చంద్రబాబును స్టీల్ వైఎస్సార్ టీయూసీ నాయకులు కలిసి అభినందించారు. నాయకులు మాట్లాడుతూ1989 నుంచి కర్మాగారం అభివృద్ధికి కృషి చేసిన రవి చంద్రబాబు సేవలను గుర్తించి యాజమాన్యం విభాగాధిపతిగా పదోన్నతి కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.వి. రమణారెడ్డి, కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, జి. అప్పలరాజు, బి. శశి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులను హడలెత్తించిన పాము



పామును పట్టుకున్న కిరణ్ కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగులను పాము హడలెత్తించింది. బుధవారం యధావిధిగా ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. విధి నిర్వహణలో భాగంగా బ్యాంక్ సిబ్బంది స్టోర్ రూమ్‌కు వెళ్లారు. అక్కడ పాము తిరుగుతూ కనిపించింది. భయంతో పరుగులు తీశారు. దీంతో స్నేక్ క్యాచర్ ఆర్. కిరణ్ కుమార్‌కు బ్యాంక్ సిబ్బంది సమాచారం అందించారు. కిరణ్ కుమార్ బ్యాంక్‌కు చేరుకుని సుమారు 5 అడుగుల పొడవు కలిగిన పామును ఒడిసి పట్టుకున్నాడు. దీంతో బ్యాంక్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పామును యారాడ కొండపై అడవిలో వదిలిపెట్టినట్టు కిరణ్ కుమార్ తెలిపారు.

రెవెన్యూ మంత్రికి సన్మానం



విమానాశ్రయంలో మంత్రిని సత్కరిస్తున్న వెంకటేష్ గౌడ్ తదితరులు

పెదగంట్యాడ: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు విశాఖ విమానాశ్రయంలో ఉత్తరాంధ్ర గీత సహ కులాల యువజన సంఘం అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. మంత్రికి స్వాగతం పలికిన వారిలో జుత్తుక రాజు, చుక్క గణేష్, పెంట సురేష్, ప్రసాద్, పడాల శ్రీనివాసరావు, రామారావు, అప్పారావు ఉన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు రేపు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నాయుడు తదితరులు

పెదగంట్యాడ: డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకలను ఈ నెల 16న సమతానగర్‌లో నిర్వహించనున్నట్టు గీత సహ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు తెలిపారు. ఈ మేరకు సంఘ కార్యాలయంలో బుధవారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస రావు, గౌతు శిరీష హాజరవుతారని తెలిపారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నెల్లి సాధూరావు, దుంగ దేవన్‌రాజు, అండిబోయిన పెద సూకరాజు, నెల్లి శ్రీనివాసరావు, నడిగట్ల గురుమూర్తి, జెర్రిపోతుల గోవిందరావు, నాగల రాజు పాల్గొన్నారు.

1280వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



దీక్షా శిబిరంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1280వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం దీక్షల్లో కూర్చున్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, ఎన్. రామారావు, నీరుకొండ రామచంద్రరావు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం విరమించు కోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడి పదార్థాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఓబీసీ సంఘం నాయకులు బి. అప్పారావు, శ్రీనివాసరావు, ఉండవల్లి శ్రీనివాసరావు, దొడ్డి సన్ని బాబు దీక్షలో కూర్చున్నారు.

మలేరియా నిర్మూలనకు పటిష్ట చర్యలు



అక్కిరెడ్డిపాలెంలో చిన్నపిల్లలకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న యాంటీ మలేరియా సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: మలేరియా నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీనియర్ ఎంటమాలజిస్ట్ కె.వరహాలు దొర అన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతమైన 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో బుధవారం యాంటి మలేరియా అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.అక్కిరెడ్డిపాలెం, చినఅక్కిరెడ్డిపాలెం (హరిజన జగ్గయ్యపాలెం) సచివాలయాల పరిధిలో ఏడు యాంటీ మలేరియా టీంలు పర్యటించాయి. ప్రతీ ఇంటిని సందర్శించి జ్వరపీడితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో యాంటి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్స్ జి.మురళీధర్, డి.ఎస్.ఎస్.ఆర్.రాజు, ఎంపీహెచ్‌వో ఎ.వి.ఎస్.రాజు, సచివాలయ ఏఎన్ఎం సీహెచ్.మహాలక్ష్మి, యూపీహెచ్‌సీ ఎంపీహెచ్ఎఫ్ ఎం.జగదీశ్వరి, సిబ్బంది డి.శ్రీదేవి, బి.వరహాలు, హెల్త్ అసిస్టెంట్లు ఎం.మురళీకృష్ణ, అప్పలరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌సీసీ క్యాడెట్లు



మొక్కలతో ఎన్‌సీసీ క్యాడెట్లు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్ 11 లోని శ్రీష్టి వరల్డ్ పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్లు మొక్కలు నాటారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రతీ ఒక్కరూ తల్లి పేరున మొక్క నాటాలి అని ఇచ్చిన పిలుపు మేరకు 13వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్యాడెట్లకు వ్యాస రచన , వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పి. సుశీలారాణి, ఈడీ డాక్టర్ కె. మేఘన, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపాల్ కిరణ్ దేవగిరి, వి. లత, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ముువ్వన్నెల పతాకం రెపరెపలు



నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న, అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ విద్యార్థులు



జాతీయ జెండాతో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఉక్కు ఇండోర్ స్టేడియంలో జెండాలతో క్రీడాకారులు

పెదగంట్యాడ: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నెల్లిముక్కు జంక్షన్ నుంచి పెదగంట్యాడ కూడలి వరకూ జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకొని ఉత్తమ పౌరులుగా మెలగాలన్నారు. ఆజాదీకా అమృత్‌లో భాగంగా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై ముువ్వన్నెల జెండా ఎగరవేసి దేశభక్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఇ శ్రీనివాస్, రమణాజీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

అక్కిరెడ్డిపాలెం: హర్ ఘర్ పే తిరంగ్ అంటూ బుధవారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ పురవీధుల్లో త్రివర్ణ పతాకాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం మాట్లాడుతూ జాతి సమైక్యతను కాపాడుతూ ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకాలు ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇస్మాయిల్, దేముళ్లు, వేణు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో వాలీబాల్ క్రీడాకారులు హర్ ఘర్ తిరంగా వేడుకలు నిర్వహించారు. స్వాతంత్య్రదినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ఉక్కు ఇండోర్ స్టేడియంలో వాలీబాల్ క్రీడాకారులు జాతీయ జెండాతో ఉత్సాహంగా పరిగెడుతూ భారత్ మాతా కి జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉక్కు స్పోర్ట్స్ విభాగం జీఎం టి.కె. ఘోష్, వాలీబాల్ క్రీడాకారులు రామస్వామి, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న సీఐ, ఎస్ఐలు, సిబ్బంది

అగనంపూడి: దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కానిస్టేబుల్ చోడమ్మకు సీమంతం సందడిగా నిర్వహించారు. సీఐ ఎర్రం నాయుడు సమక్షంలో తోటి మహిళా కానిస్టేబుళ్లు చోడమ్మకు పద్ధతి ప్రకారం చీర, జాకెట్లు, పండ్లు, పూలు, స్వీట్లతో సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు సేవ చేసినట్టే తమ తోటి కానిస్టేబుల్‌కు సీమంతం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, హెచ్‌సీలు రాజు, ప్రసాద్, సూరిబాబు, మహిళా సిబ్బంది సుశీల, స్పందన తదితరులు పాల్గొన్నారు.

25న మంత్రులు, ఎమ్మెల్యేలకు సన్మానం



అడ్‌హాక్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కేటీబీ నాయకులు

గాజువాక: ఎమ్మెల్యేలు, మంత్రులను ఈ నెల 25న గాజువాకలో ఘనంగా సత్కరించాలని గాజువాక కేటీబీ సంఘం అడ్‌హాక్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు స్థానిక శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఈ విషయంపై తీర్మానం చేశారు. అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ గుడివాడ అమ్మన్న మాట్లాడుతూ సన్మాన కార్యక్రమాన్ని కాపు, తెలగ, బలిజ, తూర్పుకాపు సంఘాల సభ్యులు పార్టీలకతీతంగా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజాన రామారావు, నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, జగదీష్, గడసాల అప్పారావు, కర్రి నాగేశ్వరరావు, గంధం వెంకటరావు, విందుల రమణ, కరణం కనకారావు, సోంబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహా ఉచ్ఛిష్ట గణపతి విగ్రహ నమూనా ఆవిష్కరణ



విగ్రహ నమూనాను ఆవిష్కరిస్తున్న నాగిరెడ్డి తదితరులు

గాజువాక: ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీనగర్ వద్ద ఏర్పాటు చేయనున్న ఉచ్ఛిష్ట గణపతి విగ్రహ నమూనాను మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను నిర్వహించడంలో ఏటా గాజువాకకు ప్రత్యేకత ఉందన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్, స్థానిక నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, పల్లా కార్తీక్, బాటా శ్రీనివాస్, గూటూరు శంకరావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా దుకాణాలు



గాంధీనగర్‌కు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన దుకాణం

పెదగంట్యాడ: మండలంలోని గోపాలరెడ్డినగర్, గాంధీనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆయా దుకాణాల వద్దకు వచ్చే కొనుగోలు దారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కొంతమంది ఆకతాయిలు తిష్ట వేయడంతో అటుగా మహిళలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గాంధీనగర్ వాసులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయా దుకాణాలను అప్పట్లో తొలగించారు. తాజాగా కొంతమంది దుకాణాలు ఏర్పాటు చేయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అధికారులు స్పందించి కొత్తగా ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు.